వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 22: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎమ్మెస్సీ (అప్లైడ్ న్యూట్రిషన్), ఎమ్మెస్సీ (స్పోర్ట్స్ న్యూట్రిషన్) కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 28వ తేదీ వరకు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చే నెల 4వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

పరీక్షా తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేశారు. బీఈడీ (ఓడీఎల్) రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 24వ తేదీ నుంచి, ఎంఏ (ఓరియంటల్ లాంగ్వేజెస్) మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 1వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

బీ ఫార్మసీ పరీక్షా ఫీజు గడువు పొడిగింపు

బీ ఫార్మసీ కోర్సు పరీక్షా ఫీజు స్వీకరణ గడువును పొడిగించారు. బీ ఫార్మసీ (పీసీఐ) అన్ని సెమిస్టర్ల మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 24వ తేదీ వరకు సంబంధిత కళాశాలలో చెల్లించవచ్చన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

24న సీనియర్ కబడ్డీ పురుషుల ఎంపిక

ఆర్కేపురం, ఫిబ్రవరి 22: ఈ నెల 24వ తేదీన సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం కబడ్డీ గ్రౌండ్‌లో రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ పురుషుల రంగారెడ్డి జిల్లా జట్లకు ఎంపిక నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చంద్రమోహన్, రాజు, రవి కుమార్ తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు మార్చి 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు పైలాన్ కాలనీ, నాగార్జునసాగర్ నల్లగొండ జిల్లా యందు నిర్వహించనున్న 70వ అంతర్ జిల్లా కబడ్డీ పోటీలలో రంగారెడ్డి జిల్లా తరుపున పాల్గొంటారని తెలిపారు. పురుషులు 85 కేజీలలోపు ఉండాలని, క్రీడాకారులు ఆధార్ కార్డును తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 76619 92581, 90000 38272కు సంప్రదించాలని కోరారు.

24న యూఎస్ యూనివర్సిటీస్ ఫెయిర్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 22: యూనిస్కాలర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 24న సోమాజిగూడలోని సంస్థ కార్యాలయంలో యూఎస్ యూనివర్సిటీస్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ బిజినెస్ హెడ్ రాజ్ నున్న తెలిపారు. సంస్థ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశం లో ఆయన మాట్లాడారు. ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు అమెరికాకు చెందిన 15 యూనివర్సిటీల ప్రతినిధులు వస్తున్నారని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో సంస్థ రీజినల్ మేనేజర్లు రాజేశ్, భవ్య, తేజస్వీని, షిఫాలీ, గురుప్రీత్ తదితరులు పాల్గొన్నారు.

25, 26న నూతన విద్యా విధానంపై సదస్సు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ): 'భారత్ బచావో' అఖిల భారత విద్యార్థుల సదస్సు ఈ నెల 25, 26న నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనుంది. 'బీజేపీ – ఆర్ఎస్ఎస్ పాలన, భారత విద్యా విధానంలో వస్తున్న మార్పులు, విద్య కాషాయీకరణ' అనే అంశంపై జరిగే ఈ సదస్సులో దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల విద్యార్థులు, పౌర హక్కుల నేతలు, న్యాయవాదులు, విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమాన్నికి హాజరు కానున్నారని నిర్వహకులు తెలిపారు.

క్రీడలో జాతీయ సెమినార్ ప్రారంభం

మాదన్నపేట, ఫిబ్రవరి 22: సస్టైనబుల్ అగ్రికల్చర్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కోసం స్మార్ట్ టెక్నాలజీస్‌పై ఐసీఏఆర్ – సీఆర్ఐడీఏ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ సెమినార్ సంతోష్‌నగర్‌లోని క్రీడా (సెంట్రల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్) లో ఐసీఆర్ – సీఆర్ఐడీఏ డైరెక్టర్ డాక్టర్ వీకే సింగ్ ప్రారంభించారు. ఈ సెమినార్‌లో శాస్త్రవేత్తలు, రైతులు, విద్యార్థులు సుమారు 350 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివయ్య, డాక్టర్ శ్రీనివాస్, డా. ప్రగతి పర్మానిక మైత్రి సెక్రటరీ ఐఎస్ఏపీ సెమినార్ యొక్క థీమ్ దాని లక్ష్యాలను వివరించారు.

పెను భారం.. డ్రైనేజీ పునర్నిర్మాణం

సామాన్యుల పీక్కు తినేలా.. పాలకులు, అధికారుల తీరు *ఇంటి కనెక్షన్‌కు రూ.5ల నుంచి 15 వేలు వసూలు*

- మ్యాన్‌హోళ్ల స్థానభ్రంశంతో సమస్య ఉత్పన్నం
- లబోదిబోమంటున్న గుంటి జంగయ్య కాలనీవాసులు

గుంటిజంగయ్య కాలనీలో నూతన పైప్‌లైన్ నుంచి ఇంటి కనెక్షన్‌లు ఇస్తున్న దృశ్యం

వనస్థలిపురం, ఫిబ్రవరి 22: పాలకులు, అధికారుల దుర్మార్గపు పోకడల కారణంగా సామాన్యులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజల శ్రేయస్సు కోసం పాటు పడాల్సిన ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం కుమ్మక్కై వారిని పీడించుకు తినేందుకు తయారయ్యారు. కాలనీ అభివృద్ధి పథంలోకి పరుగు తీస్తున్నందంటే.. ముందుగా కాలనీ వాసులే ఎంతో సంబరపడిపోతుంటారు. పాత డ్రైనేజీ స్థానంలో కొత్తలైన్ వస్తుండటంతో వారంతా ఆనందం వ్యక్తం చేశారు. ఇక తమకు డ్రైనేజీ సమస్యలుండవని సంబరపడ్డారు. తీరా పనులు పూర్తయ్యాక అది తమకు గుదిబండగా మారిందని ఆందోళన చెందుతున్నారు. ఇది పేదల బస్తీ, గుంటి జంగయ్య కాలనీలో పరిస్థితి. డ్రైనేజీ నిర్మాణం పూర్తయ్యాక ఇళ్లలోకి కనెక్షన్ తీసుకోవడానికి రూ.5 నుంచి 15 వేలు వసూలు చేస్తుండడం వారికి భారంగా మారింది.

మ్యాన్‌హోళ్ల మార్పుతోనే సమస్య...

గుంటి జంగయ్య కాలనీలో ఇంటి నం. 3-10-184 నుంచి 3-10-443/7/1 వరకు డ్రైనేజీ పునరుద్ధరణ మంజూరయ్యింది. ఇటీవల కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. గతంలో ఉన్న పాత డ్రైనేజీ విధానాన్ని తొలగించి కొత్త పైపులు వేసి, మ్యాన్‌హోళ్లను నిర్మించాలి. కాని, మ్యాన్‌హోళ్లను అదే స్థానంలో కాకుండా వెనుకా ముందు నిర్మించడంతో సమస్య ఉత్పన్నమయ్యింది. మ్యాన్‌హోళ్లు అదే స్థానంలో ఉంటే ఇళ్లలోకి కనెక్షన్ కలుపుకునేవారికి ఇబ్బంది ఉండేది కాదు. పాత కనెక్షన్‌ను తిరిగి కలుపుకుంటే అయిపోయేది. కాని, మ్యాన్‌హోళ్లు స్థానభ్రంశం చెందడంతో ప్రజలు తమ ఇండ్లకు కనెక్షన్ తీసుకోవడం సమస్యగా మారింది. పాత కనెక్షన్‌ను పూర్తిగా తొలగించి కొత్తగా పైపులు వేసుకోవాల్సి వచ్చింది. దీనికి గుత్తేదారు సిబ్బంది రూ.5 నుంచి 15 వేల వరకు వసూలు చేస్తున్నారు. అసలే పేదల బస్తీ వారి ఆదాయం అంతంత మాత్రం, ఇంటికి డ్రైనేజీ లైన్ తప్పనిసరి కావడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. చేసేది లేక కొంతమంది వాళ్లు అడిగిన డబ్బులు ఇచ్చి కనెక్షన్ కలుపుకోవాల్సి వచ్చింది. దాంతో పాటు దెబ్బతిన్న తాగునీటి కనెక్షన్ల పునరుద్ధరణకు కూడా డబ్బులు వసూలు చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదంతా జల మండలి అధికారులకు తెలియకుండానే జరుగుతోందా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. కాగా, ఈ విషయంపై జలమండలి అధికారి రవీందర్‌రెడ్డి తమకేమీ తెలియదంటూ.., కార్పొరేటరో, ఎమ్మెల్యేనో చెప్పి ఉంటారు. అందుకే మార్చి ఉండవచ్చని తనదైన శైలిలో చెప్పడం కొసమెరుపు.

మాకేమీ తెలియదు.. ఫిర్యాదు చేస్తే చూస్తాం

పునర్నిర్మాణంలో మ్యాన్‌హోళ్లను ఎట్టి పరిస్థితుల్లో మార్చం. ఇక్కడ ఎలా మారిందో.. మాకు తెలియదు. ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. ఎవరైనా రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చూస్తాం. కార్పొరేటరో, ఎమ్మెల్యేనో చెప్పి ఉండవచ్చు అందుకే మ్యాన్‌హోళ్లను మార్చి ఉంటారు. దీనికి సంబంధించి ఏ విషయము మా దృష్టిలోకి రాలేదు.

- రవీందర్‌రెడ్డి, జలమండలి అధికారి

అధికారుల నిర్లక్ష్యం ఫలితమే..

మా కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ పనుల విషయంలో జల మండలి అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా తెలుస్తోంది. పాత మ్యాన్‌హోళ్ల స్థానంలోనే కొత్తవాటిని నిర్మిస్తే సరిపోయేది. అధికారులు పనులను పర్యవేక్షణ చేసి, స్పష్టమైన ఆదేశాలిస్తే గుత్తేదారు నిర్మాణం చేసేవారు. కాని, అధికారులు పట్టించుకోకపోవడం కారణంగా ఇష్టారాజ్యంగా పనులు నిర్వహించారు. దీంతో ప్రజలంతా కొత్తగా ఇంటి కనెక్షన్లు తీసుకోవాల్సి వచ్చింది. దానికి తోడు తవ్వకాల్లో దెబ్బతిన్న తాగునీటి కనెక్షన్లు ఇచ్చేందుకు కూడా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరపాలి.

- కామల్ల రవి కుమార్, గుంటి జంగయ్య కాలనీ



కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానాన్ని అందజేస్తున్న కార్పొరేటర్లు..

జిల్లాలో అవిశ్వాసాల పరంపర

- మీర్‌పేట్ మేయర్, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాస తీర్మానం
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన కార్పొరేటర్లు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 22: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అవిశ్వాసాల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్లపై అవిశ్వాసాల తీర్మానాలు పూర్తయ్యాయి. అలాగే, మణికొండ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై కూడా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా గురువారం బల పరీక్ష నిర్వహించారు. అలాగే, ఉప్పరిగూడ, బాట సింగారం సహకార సంఘాల చైర్మన్లపై కూడా అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టగా, గురువారం ఉప్పరిగూడ సహకార సంఘం చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై బలపరీక్ష నిర్వహించారు. చైర్మన్ కోర్టును ఆశ్రయించగా, బల పరీక్ష వివరాలను అధికారులు గోప్యంగా ఉంచి సీల్డ్ కవర్‌లో కోర్టుకు అందజేశారు. అలాగే, ఈ నెల 28న బాట సింగారం సహకార సంఘం చైర్మన్‌పై కూడా అవిశ్వాస తీర్మానం బలపరీక్ష నిర్వహించనున్నారు. అలాగే, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్‌పై కూడా జడ్పీటీసీలు అవిశ్వాసం ప్రవేశపెట్టారు. తాజాగా జిల్లాలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్లపై కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ మేరకు మెజార్టీ కార్పొరేటర్లు గురువారం అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా సంతకాలు చేసి జిల్లా కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేశారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో డిజిటల్ అక్షరాస్యతా దినోత్సవం

సమావేశంలో మాట్లాడుతున్న కులదీప్ భరద్వాజ్, చిత్రంలో తదితరులు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 22: పంజాబ్ నేషనల్ బ్యాంక్ సికింద్రాబాద్, మాదాపూర్ బ్రాంచ్‌లలో గురువారం డిజిటల్ అక్షరాస్యతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ సర్కిల్ మార్కెటింగ్ హెడ్ కులదీప్ భరద్వాజ్ మాట్లాడుతూ, పంజాబ్ నేషనల్ బ్యాంక్ డీజీ హోమ్ లోన్, ఈఓడీ ఎగైనెస్ట్ ఎఫ్‌డీఆర్, ప్రీ అప్రూవ్డ్ పర్సనల్ లోన్ వంటి ఆధునిక సేవలను ప్రారంభించిందని తెలిపారు. బిజినెస్ లోన్, డిజిటల్ గోల్డ్ లోన్, పీఎన్‌బీ అధికారిక వెబ్‌సైట్, పీఎన్‌బీ పన్ మొబైల్ బ్యాంకింగ్ సేవలు ఇప్పటికే అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు 2016 నుంచి ప్రతి ఏడాది ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలలో భాగంగా ఫిబ్రవరి 4వ గురువారం డిజిటల్ అక్షరాస్యతా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నాలా పనులను త్వరితగతిన పూర్తి చేయండి

పాత నగర పర్యటనలో కమిషనర్ రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ): యాకుత్‌పుర మౌలిక చిల్ల గంగానగర్ నుంచి భవానీ నగర్ వరకు చేపట్టే నాలా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ రొనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కమిషనర్ హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీతో గంగానగర్ వద్దపు నీటి కాలువను పరిశీలించారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు లేకుండా యుద్ధ ప్రాతిపదికన నాలా పనులను పూర్తి చేసేందుకు ఏజెన్సీ మెటీరియల్‌ను పెంచి వర్షాకాలం పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు కమిషనర్ మొఘల్‌పుర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జీహెచ్ఎంసీకి చెందిన పలు విభాగాల కార్యాలయాలు ఇక్కడి నుంచి మార్చేందుకు అనువైన భవనాలను గుర్తించాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. అక్కడి నుండి చార్మినార్ సర్దార్ మహల్ పునరుద్ధరణ పనులు, చార్మినార్ వద్ద మల్టీ లెవల్ పార్కింగ్ పనులను పరిశీలించారు. సర్దార్ మహల్ పునరుద్ధరణ పనులను నిర్దేశించిన కాల వ్యవధి కంటే ముందు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మొఘల్‌పుర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్విమ్మింగ్ పూల్ మరమ్మతులు చేపట్టాలని అడిషనర్ కమిషనర్ స్పోర్ట్స్ యాదగిరి రావును ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మీర్ జుల్ఫేకర్ అలీ, జాఫర్ హుస్సేన్ మిరాజ్, ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్, కార్పొరేటర్ సోహెల్‌ఖాద్రీ, సీసీపీ రాజేంద్ర ప్రసాద్ నాయక్, జోనల్ కమిషనర్ వెంకన్న , ఎస్ఈ దత్తు, ఈఈ వెంకటేష్ పాల్గొన్నారు.

వైభవంగా నిత్యానంద త్రయోదశి వేడుక

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ)/ బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో నిత్యానంద త్రయోదశి వేడుకను ఘనంగా నిర్వహించారు. సాయంకాలం 108 కలశాలతో నిత్యానంద గౌరాంగ అష్టోత్తర శత కలశ మహాభిషేకం నిర్వహించారు. మహా హారతి అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఎన్ఏఎఫ్ఎస్‌సీఓబీకి అమృత్ కాల్ బాధ్యతలు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 22: భారత ప్రభుత్వం చేపడుతున్న అమృత్ కాల్ సమయా (2022-207) నికి గాను స్వల్పకాలిక సహకార పరపతి వ్యవస్థ యొక్క వ్యాపార అభివృద్ధిపై ప్రణాళిక విస్తరణ అధ్యయన బాధ్యతలను ఎన్ఏఎఫ్ఎస్‌సీఓబీ చేపట్టనుంది. ఈ మేరకు గురువారం బెంగుళూరులో నిర్వహించిన ప్రాంతీయ స్థాయి అమృత్ కాల్ సమావేశంలో కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆ రాష్ట్ర సహకార శాఖ మంత్రి కె.ఎన్.రాజన్నతో కలిసి బాధ్యతలను అప్పగించారు. కార్యక్రమంలో ఎన్ఏఎఫ్ఎస్‌సీఓబీ/టీఎస్‌సీఏబీ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, ఎస్ఏఎఫ్ఎస్‌సీఓబీ ఎండీ భీమా సుబ్రహ్మణ్యం, టీఎస్‌సీఏబీ ఎండీ డాక్టర్ నేతి మురళీధర్, టీఎస్‌సీఏబీ బోర్డ్ డైరెక్టర్స్, దక్షిణాది రాష్ట్రాలలోని అన్ని జిల్లాల సహకార బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్తాచాటిన జిమ్నాస్ట్‌లు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కోజికోడ్(కేరళ) వేదికగా జరిగిన జాతీయ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జిమ్నాస్ట్‌లు సత్తా చాటారు. మూడు రోజుల పాటు జరిగిన టోర్నీలో తెలంగాణకు మూడు పతకాలు దక్కాయి. పురుషుల అక్రోబాటిక్ పెయిర్ ఈవెంట్‌లో కుమారస్వామి, కుతుబుద్దీన్ జోడీ రజతంతో పాటు కాంస్య పతకం కైవసం చేసుకుంది. టబ్లింగ్ టీమ్ చాంపియన్ షిప్‌లో సంజీవ్ కుమార్, భరత్ కుమార్, పవన్ సూర్య, వినయ్‌తో కూడిన టీమ్ పసిడి పతకంతో మెరిసింది. టబ్లింగ్ వ్యక్తిగత విభాగంలో పవన్ సూర్యకు స్వర్ణ పతకం దక్కింది. పతక విజేతలను స్పోర్ట్స్ డైరెక్టర్ లక్ష్మి గురువారం హైదరాబాద్‌లో అభినందించారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు 10 నామినేషన్లు దాఖలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుంది. గడిచిన మూడు రోజుల్లో తొలి రెండు రోజులు కలిపి 10 నామినేషన్లు దాఖలు చేయగా, గురువారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని అధికారులు తెలిపారు. ఈ నెల 27 వరకు (25వ తేదీ తప్ప) జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఔత్సాహికులు ఎన్నికల విభాగం అదనపు కమిషనర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు సమర్పించాలని అధికారులు తెలిపారు.

సీఎంపలో.. ఆలిండియా టాపర్ మాస్టర్ మైండ్స్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 22: 'ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' ఫిబ్రవరి 21న ప్రకటించిన సీఎంఏ ఫలితాలలో ప్రముఖ విద్యాసంస్థ మాస్టర్ మైండ్స్ విద్యార్థులు అఖిల భారత స్థాయిలో ప్రభంజనం సృష్టించారు. సీఎంఏ ఇంటర్‌లో మొదటి 50 ర్యాంక్‌లలో ఆలిండియా 5వ ర్యాంక్‌తో పాటు 49 మంది విద్యార్థులు వివిధ ర్యాంకులు సాధించారని మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మోహన్ తెలిపారు. సీఎంఏ ఫైనల్ ఫలితాలలో మొదటి 50 ర్యాంకులలో ఆలిండియా 2వ ర్యాంకుతో పాటు 34 మంది వివిధ ర్యాంకులు సాధించారని వెల్లడించారు. సీఎంఏ ఫలితాలలో సమానమైన మార్కులు వచ్చిన విద్యార్థులుంటే ఒకే ర్యాంకును ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థులకు ప్రకటిస్తారని పేర్కొన్నారు. సీఎంఏ ఇంటర్, సీఎంఏ ఫైనల్ ఫలితాలలో మొదటి 50 ర్యాంకులలో 83 ర్యాంకులు కైవసం చేసుకున్న ఏకైక విద్యా సంస్థ మాస్టర్ మైండ్స్ అని అన్నారు. ఇవి కేవలం ఈ ఒక్క ఏడాది సాధించిన ఫలితాలేనని, విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని, ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.



రవీంద్రభారతిలోని తన చాంబర్‌లో ఎక్సైజ్ శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీని గురువారం ఎక్సైజ్ శాఖ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ జె.హరికృష్ణ, జనరల్ సెక్రటరీ సీహెచ్ విజయ్, ట్రేజరర్ డి.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ కృష్ణప్రియ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కిరణ్ కుమార్, గౌరవ అధ్యక్షుడు ఖురేషి, కార్యవర్గ సభ్యులు దత్తురాజు గౌడ్, కృష్ణ, శ్రీనివాసరావు, ఉజ్వల రెడ్డి, నవీన్ కుమార్, ఫజియుద్దీన్ పాల్గొన్నారు. *- హైదరాబాద్, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ)*

నగరంలో మోడ్రన్ కబడ్డీ ఆవిష్కరణ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గ్రామీణ క్రీడ కబడ్డీ కొత్త హంగులు అద్దుకుంటున్నది. ఇప్పటికే ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ద్వారా కార్పొరేట్ కలను సంతరించుకున్న కబడ్డీని మరింత ఆకర్షణీయంగా మారుస్తూ 'మోడ్రన్ కబడ్డీ'ని ఆవిష్కరించారు. దోమలగూడ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ ప్రిన్సిపాల్ కుంభం రాంరెడ్డి ఈ మోడ్రన్ కబడ్డీపై డాక్టరేట్ సాధించారు. ఈ క్రమంలోనే మోడ్రన్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పేరుతో గురువారం ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజారావు, జగన్ మోహన్ గౌడ్, కుమార్, రవి కుమార్ పాల్గొన్నారు.

సీసీఎంబీలో ఫౌండేషన్ డే వేడుక

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ): సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీలో 8వ ఫౌండేషన్ డే వేడుకను గురువారం ఘనంగా నిర్వహించారు. సీసీఎంబీ పీహెచ్‌డీ విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా ఉన్న సీసీఎంబీ అలూమ్నీ సభ్యులు పాల్గొన్నారు. సీసీఎంబీ ఫౌండర్ డైరెక్టర్ అయిన డా. పీఎం భార్గవ జయంతి వేడుకలను ఫౌండేషన్ డేగా ఏటా సీసీఎంబీ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కాగా, సదస్సుకు ముఖ్య అతిథిగా డైరెక్టర్ వినయ్ నందికూరి పాల్గొని, సృజనాత్మకమైన ఆలోచనా విధానం ఆధునిక యుగంలో కీలకమన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శనతో వేడుకలను ముగించారు.

నిమ్స్‌లో ఎన్‌హెచ్‌ఏ బృందం పర్యటన

ఖైరతాబాద్, ఫిబ్రవరి 22: నిమ్స్ దవాఖానను కేంద్ర ప్రభుత్వ జాతీయ హెల్త్ అథారిటీ బృందం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా నేషనల్ హెల్త్ అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దీప్తి గౌర్ ముఖర్జి, అడిషనల్ సీఈవో డాక్టర్ బసంత్ గార్గ్‌లకు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప స్వాగతం పలికారు. తొలుత డయాలసిస్ కేంద్రానికి తీసుకెళ్లి అక్కడ రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా అందిస్తున్న ఉచిత సేవలపై వివరించారు. అనంతరం, బోర్డు రూమ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నిమ్స్‌లో అందిస్తున్న వైద్య సేవలను గుర్చి చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ లక్ష్మి భాస్కర్, డాక్టర్ గంగాధర్, డాక్టర్ స్వర్ణలత, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

రోగుల సేవల గురించి తెలుసుకుంటున్న దీప్తి గౌర్, చిత్రంలో తదితరులు

ఎల్లీ ఏజ్ హార్ట్ ఎటాక్‌లపై సీడీఎఫ్‌డీలో వర్క్‌షాప్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ): యుక్త వయసులో వచ్చే హృద్రోగాలపై సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్‌లోని మాలిక్యూలర్ బయాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రముఖ కార్డియో రీహాబ్ ఫిజిషీయన్ డా. మురళీధర్ బాబి ప్రసంగించారు. గుండె వ్యాధుల కారణాలను విశ్లేషిస్తూనే... జీవితంలోని అలవాట్లు, ఆహారపు విధానాలు కూడా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడీఎఫ్‌డీ పరిశోధకులు, మాలిక్యూలర్ బయాలజీ నిపుణులు హాజరయ్యారు.

న్యూట్రాసిటికల్ సాల్ట్‌పై ఐఐసీటీ పరిశోధన

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ): డ్రగ్ తయారీలో కీలకమైన న్యూట్రాసిటికల్ సాల్ట్‌పై ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి చెందిన శాస్త్రవేత్తలు చేసిన పరిశోధన అధ్యయనాన్ని ప్రముఖ కెమికల్ రీసెర్చ్ పబ్లిషర్ క్రిస్టింగ్ కామ్‌లో ప్రచురించారు. ఐఐసీటీకి చెందిన సైంటిస్ట్ సునీల్ కుమార్ చేసిన అధ్యయనం డ్రగ్ తయారీలో అత్యంత కీలకమైనది. శరీరంలోకి చేరిన డ్రగ్ కరిగే కాల పరిమితిని బట్టి, మందు పనితీరును అంచనా వేయడంలో ఈ సాల్ట్స్ ముఖ్య భూమికను పోషిస్తాయి. రోగి శరీరంలో పీహెచ్ స్థాయిలను బట్టి డ్రగ్ స్పందన తెలుసుకునే వీలుంటుందని పరిశోధకులు చెబుతున్నారు.

జీహెచ్ఎంసీలో అంతర్గత బదిలీలు

సిటీబ్యూరో, ఫ